సాక్షి
నారాయణపేట
గురువారం । 13 । మార్చి । 2025



కిడ్నీ.. బీకేర్ ఫుల్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కిడ్నీ సమస్యతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (గురువారం సాయంత్రం)

సహర్ 5-03 (శుక్రవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.8 /16.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిపై హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఫిర్యాదు

నారాయణపేట: నారాయణపేట **జిల్లా జడ్జి** అబ్దుల్ రఫీపై చర్యలు తీసుకో**వాలని పేట** బార్ అసోసియేషన్ తరపున హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి హైకోర్టు చీఫ్ జస్టీస్ సుజయ్‌పాల్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. జిల్లా జడ్జి న్యాయవాదులపై అనుచితంగా ప్రవర్తిస్తూ కించపరుస్తున్నారని, కోర్టు సిబ్బంది నియామకాలు, సామాగ్రి కొనుగోలులో అవినీతికి పాల్పడ్డారని తక్షణమే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే, జిల్లా జడ్జి వైఖరిని నిరసిస్తూ బుధవారం 5వ రోజు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు విధులు బహిష్కరించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతోపాటు క్లైంట్‌లను, న్యాయవాదులను కించపరుస్తున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, సభ్యులు తెలిపారు. ఆయనపై చర్య తీసుకునే వారకు పోరాటం చేస్తామని అన్నారు.

తెల్లకుసుమలు క్వింటాల్ రూ.5,809

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం తెల్ల కుసుమలు క్వింటాల్‌కు గరిష్టం, కనిష్టంగా రూ.5,809 ధర పలికాయి. అలాగే, శనగలు గరిష్టం, కనిష్టంగా రూ.5,812, పెసర గరిష్టం రూ.7,503, కనిష్టం రూ.7,132, వేరుశనగ గరిష్టం రూ.6,080, కనిష్టం రూ.5,420, జొన్నలు గరిష్టం రూ.4,640, కనిష్టం రూ.2,422, ఎర్ర కందులు గరిష్టం రూ.7,371, కనిష్టం రూ.5,622, తెల్ల కందులు గరిష్టంగా రూ.7,631, కనిష్టంగా రూ.6,540 ధరలు పలికాయి.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనపై శిక్షణ

బిజినేపల్లి: వ్యవసాయ అనుబంధ రంగాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే నిరుద్యోగ యువతకు రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డా.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తయిన యువతకు ఈ నెల 21, 22 తేదీల్లో మైక్రోబియల్ బయో ఫెస్టిసైడ్స్, బయోపాలిమర్ సాంకేతికత, ఆయిల్ ప్రాసెసింగ్ యూనిట్లు, భూసార పరీక్షకేంద్రాలు, విత్తనోత్పత్తి, సేంద్రియ వ్యవసాయ వనరులను స్థాపించేందుకు అవసరమైన అంశాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన పెట్టుబడి రుణాలు, సబ్సిడీ పథకాల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన యువత 92473 3 63334 నంబర్లను సంప్రదించి మరింత సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు.

విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ పీయూ అధ్యక్షుడు నగేష్ పేర్కొన్నారు. పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలకు ప్రభుత్వం నిధులు పెంచకుండా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేటు కళాశాలల మాదిరిగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. భారీగా ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సరిగ్గా లేరని, వీసీలను నియమించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీలను నియమించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కంపు కొడుతున్నాయ్..!



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నారాయణపేట జిల్లా కేంద్రంలోని పరిమళపురం బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన నాలా. వర్షాకాలంలో కొండారెడ్డిపల్లి చెరువు నుంచి వచ్చే వరద ఈ నాలా మీదుగా వెళ్తుంది. బువ్వమ్మదర్గా, బహార్‌పేట, సుభాష్‌రోడ్, సరాఫ్ బజార్, పరిమళపురం, ఎస్సీ కాలనీలకు చెందిన మురుగు సైతం ఈ నాలా మీదుగా పారుతుంది. అయితే ముళ్ల పొదలతో నిండుకుపోయి చెత్తా చెదారంతో దర్శనమిస్తుంది. చెత్త తొలగించకపోవడం.. మురుగు తీయకపోవడంతో దోమలు, పందులకు స్థావరమైంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆ నాలాను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ ఉషేనమ్మ. నారాయణపేటలోని కొత్త ఎస్సీ కాలనీలోని నివసిస్తుంది. ఓపెన్ డ్రెయినేజీలో చెత్త, మురుగు తొలగించకపోవడంతో దోమల బెడద తీవ్రమైందని ఆవేదన వ్యక్తం చేస్తుంది. రోడ్డు ఎత్తు కావడం.. కాల్వలు కిందికి వెళ్లడంతో మురుగు పారడం లేదని, నూతన డ్రెయినేజీలు నిర్మించాలని కోరుతోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని బారంబావి దగ్గరలో ఉన్న బారంకుంట. మురుగు చేరుతుండడంతో అదికాస్తా దోమల పెంటగా మారింది. ఆ ప్రాంతంలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగు ఆ కుంటలోకి చేరడంతో దుర్గంధ భరితంగా మారింది. పందులు, దోమలకు స్థావరం కావడంతో రోగాల పాలవుతున్నామంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బారంకుంట నుంచి మురుగును ప్రధాన డ్రైనేజీకి కలపాలని వేడుకుంటున్నారు.



మున్సిపాలిటీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- రోడ్లపై పారుతున్న మురుగు
- కొత్తకాలనీలు, ఓపెన్ ప్లాట్లలో పరిస్థితి మరింత అధ్వానం
- దోమలు, వరాహాల బెడద తీవ్రం
- రోగాల బారినపడుతున్న జనం

సాక్షి ఫోకస్

నారాయణపేట: జిల్లాలోని పురపాలికల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరులో డ్రైనేజీ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో మురుగు రహదారులపై పారుతోంది. దీంపాటు ఇళ్ల నడుమ మురుగు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. వరాహాలు, దోమల వ్యాప్తిచెంది ప్రజలు అనారోగ్యం బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు.

■ నారాయణపేట కొత్తకాలనీలతో వేగంగా విస్తరిస్తోంది. అయితే చాలాచోట్ల మురుగు పారేందుకు సరైన కాల్వలు లేవు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రతిపాదనలకే పరిమితమైంది. పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా పట్టణాల్లో డ్రెయినేజీ వ్యవస్థ మారడం లేదు. వర్షం వస్తే సుభాష్ రోడ్డు నుంచి చౌక్‌బజార్, వీరసావర్కర్ చౌరస్తా మీదుగా వచ్చే డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీసీ కాలనీ, కొత్త ఎస్సీ కాలనీ, యాద్గీర్-పళ్ల రోడ్, బహార్‌పేట, పరిమళపురం, గాంధీనగర్,సుభాష్‌రోడ్, పేరపళ్ల రోడ్, శ్రీనగర్ కాలనీల్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఓపెన్ డ్రెయినేజీల్లో మురుగు, చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై మురుగు పారుతూ.. కాలనీలు కంపు కొడుతున్నాయి. దీంతో ప్రజలు దోమలు, పందులతో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



నారాయణపేటలోని యాద్గీర్ రోడ్‌లో డ్రెయినేజీ లేక మురుగు పారుతోంది ఇలా..

■ కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని కొత్త కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస కాలనీ, హనుమాన్ నగర్ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేదు. సీఎం ఇలాఖా కావడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.102.84 లక్షలు మంజూరయ్యాయి. మున్సిపాలిటీలో ఇప్పటివరకు 19.35 కి.మీ వరకు డ్రైనేజీలు నిర్మించారు. విద్యానగర్, సాయినగర్ కాలనీల్లోని ఓపెన్ ప్లాట్లలో మురుగు చేరుతుండడంతో దుర్గంధభరితంగా మారాయి.

■ మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో రెండు కిలోమీటర్ల వరకు రూ.40 లక్షల వ్యయంతో ప్రధాన డ్రైనేజీ నిర్మించారు. ఐదు కిలోమీటర్ల వరకు అంతర్గత డ్రైనేజీలు ఉన్నాయి. కొత్త బస్టాండ్ దగ్గరలో, ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర కాలనీలో, అమర్‌గడ్డలో పాత బస్టాండ్ కాలనీలో పలుచోట్ల డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపైకి పారుతుంది.

■ మక్తల్ మున్సిపాలిటీలో ప్రధానంగా 8, 9 వార్డుల్లో వానొస్తే చాలు యల్లమకుంటలో అంతా మురుగుమయమైంది. కేశవనగర్, వినాయకనగర్, అంబేద్కర్ నగర్, రహమానీయ కాలనీల్లో డ్రైనేజీలు మురుగుతో నిండినా రోజుల తరబడి తీయడం లేదు. చాకలి గేరిలో మురుగు నిలిచి రోడ్లు గుంతలమయంగా మారాయి. వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో కాలనీవాసులు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఇళ్ల మధ్య మురుగు నిలవడంతో దోమలు, పందుల సంఖ్య రెట్టింపవుతుంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

జిల్లా వివరాలిలా..

మున్సిపాలిటీ	వార్డులు	నివాసాలు	జనాభా
నారాయణపేట	24	9,301	50,000
మక్తల్	16	7,733	22,165
కోస్గి	16	6,374	22,300
మద్దూర్	14	4,325	16,350



కోస్గిలోని విద్యానగర్‌లో డ్రెయినేజీ లేక ఇళ్ల మధ్య పారుతున్న మురుగు



మక్తల్ శబరికాలనీలో ఇళ్ల మధ్య ఏర్పడిన మురుగు కుంట

డ్రెయినేజీలు నిర్మించాలి



ప్రధాన వీధులన్నీ మురికి కూపాలుగా మారాయి. కొత్తకాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపైకి వచ్చి చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మురుగు నిల్వ ఉండడంతో దోమల బెడద తీవ్రమైంది. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించడంతోపాటు విధిగా డ్రైనేజీల్లో మురుగు తొలగించాలి.

– రాజు, శ్రీనగర్ కాలనీ, కోస్గి మున్సిపాలిటీ

అధికారుల నిర్లక్ష్యంతోనే..



మక్తల్ పట్టణంలో మున్సిపాలిటీ పరిదిలోని 8, 9 వార్డులో మురికికుంట ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఎన్ని సార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఇళ్ల మధ్య చెత్తచెదారం నిలిచి ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు మా గోడు దేవుడికే తెలుస్తుంది. దోమకాటుతో టైఫాయిడ్, డెంగీ లాంటి రోగాల బారిన పడుతున్నాం.

– బాబు, శబరికాలనీ, మక్తల్

బావాజీ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి



తిమ్మారెడ్డిపల్లి జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

కొత్తపల్లి: దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద గిరిజన లంబాడా జాతర.. గురులోకమా సంద్ బావాజీ జాతర అని.. అన్ని ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 11వ తేది నుండి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు బుదవారం అన్ని శాఖల వారిగా నారాయణ పేట జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ (లోకల్ బాడి) సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి, స్నానాల గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించాలని, ఇప్పటినుంచే పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. అనంతరం ఇంతకుముందు నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులతో పాటు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

కృష్ణా: పదో తరగతి విద్యార్థులతోపాటు ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ గోవిందరాజులు సూచించారు. బుధవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు అనుసరించాల్సిన విషయాలను వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెనుక ఎంఈఓ నిజాముద్దీన్,ఎండీఎం యాదయ్యశెట్టి,జీసీడీఓ నర్మద, ఎస్ఓ షాలిని,సీఆర్పీ అమీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 86 మంది గైర్హాజరు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిలాలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 4074 మంది విద్యార్థులకుగాను 3988 మంది హాజరయ్యారు. 86 మంది గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 3527 మందికి 3460 మంది హాజరయ్యారు. 67 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 547 మందికి గానూ 528 మంది హాజరై 19 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సుదర్శన్‌రావ్ తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్ష నిర్వహించాలని వాఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

వంగూరు: ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. బుధవారం వంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉండాలన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులంతా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. కాగా, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడం, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు క్షేత్రస్థాయిలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందనే అంశాలపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ కమిషన్ సభ్యులు జ్యోత్స్న శివారెడ్డి, విశ్వేశ్వర్, ఎంఈఓ మురళీ మనోహరాచారి తదితరులు ఉన్నారు.

విద్యార్థి కంటికి ‘సురక్ష’

- ‘సమగ్ర కంటి పరీక్ష– ఉచిత కంటి అద్దాల పంపిణీ’లో పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో 9,427మంది విద్యార్థులకు కంటి సమస్యలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో 2,355 మందికి అద్దాలు పంపిణీ



విద్యార్థినికి కంటి అద్దాలు పెడుతున్న ఆర్‌బీఎస్‌కే డాక్టర్ లీల

జడ్చర్ల టౌన్: కంటి సమస్య ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం చూపును ప్రసాదిస్తోంది. ఆర్‌బీఎస్‌కే ద్వారా ‘సమగ్ర కంటి పరీక్ష– ఉచిత కంటి అద్దాల పంపిణీ’లో పరీక్షలు నిర్వహించి సమస్యలున్న విద్యార్థులకు కంటి అద్దాలు మంజూరయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 2,355 మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు జరిపారు. ఫిబ్రవరి 28వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో 2,373 మందికి, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,427 మంది విద్యార్థులు, రాష్ట్రవ్యాప్తంగా 89,105 మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరంతా చూపు మందగించి చదవడానికి ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్‌బీఎస్‌కేకు చెందిన ఏడు బృందాలు 2,373 మందికి పరీక్షలు జరపగా.. వారిలో 2,355 మందికి అద్దాలు వచ్చాయి. వీరందరికి అద్దాల పంపిణీ చేస్తున్నారు.

సమస్యలున్న వారికి అద్దాలు

విద్యార్థులకు కంటి చూపు అందించే లక్ష్యంగా వైద్య పరీక్షలు నిర్వహించి సమస్యలున్న వారికి అద్దాలు పంపిణీ చేసినట్లు డీఐఓ డా.పద్మజ తెలిపారు. బుధవారం బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 14 మంది విద్యార్థులకు అద్దాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు సునీల్, లీల, కంటి వైద్యపరీక్ష నిపుణులు దత్తాత్రేయ రావు, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ మనుప్రియ, హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

310 మందికి అద్దాలు..

జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లో 310 మంది విద్యార్థులకు అద్దాలను పంపిణీ చేస్తున్నాం. ఫిబ్రవరి 28న హైస్కూళ్లు, గురుకులాల్లో చదవడానికి ఇబ్బంది పడే వారికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరీక్షలు చేయించాం. వీరందరికీ అద్దాలను అందజేస్తాం.

– డా.సునీల్, ఆర్‌బీఎస్‌కే, జడ్చర్ల



బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో కంటి అద్దాలను పంపిణీ చేసిన డీఐఓ డా.పద్మజ

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన రామలింగేశ్వరస్వామి ఆలయం



కల్యాణం జరిపిస్తున్న పండితులు



కల్యాణానికి హాజరైన మహిళలు

అడ్డాకుల: కందూర్ శ్రీరామలింగేశ్వర క్షేత్రంలో బుధవారం కల్యాణోత్సాన్ని కనులపండువగా నిర్వహించారు. దక్షిణ కాశీగా వెలుగొందుతున్న ఆలయంలో వేలాదిమంది భక్తుల సమక్షంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా గ్రామంలో మహిళలు సిద్ధం చేసిన తలంబ్రాల బియ్యాన్ని ప్రత్యేక పల్లకిలో మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పురోహితుల వేదమంత్రాల మధ్య ఉత్సవమూర్తులకు కల్యాణ వేడుకను నిర్వహించారు. కారెడ్డి నాగిరెడ్డి, తోకల దామోదర్‌రెడ్డిరెడ్డిలు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అభిషేకాలు నిర్వహించి, శివలింగాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

■ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కవిత దంపతులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామలింగేశ్వరాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆలయ ఆవరణలో ఇటీవల పూర్తి చేసిన సీసీ రోడ్లు, మంచి నీటి కుళాయిలను ప్రారంభించారు. ఆలయం వద్ద బ్రహోత్సవాల ఏర్పాట్లను పరిశీలించి ఆలయ నిర్వాహకులతో మాట్లాడారు. బ్రహోత్సవాలను విజయవంతం చేసి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ రాజేశ్వరశర్మ, జూనియర్ అసిస్టెంట్ అనంతసేన్ రావు, నాయకులు అరవింద్‌రెడ్డి, నాగిరెడ్డి, తోట శ్రీహరి, జగదీశ్వర్, నాగార్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని మహిళ దుర్మరణం



మంగమ్మ (ఫైల్)

దేవరకద్ర రూరల్: కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. ఆయన కథనం మేరకు.. కౌకుంట్లకు చెందిన దండు మంగమ్మ (36)కు 12 ఏళ్ల కిందట మణికొండకు చెందిన సంజీవతో వివాహమైంది. పెళ్లయిన రెండేళ్లకే భర్త మృతి చెందడంతో కుమారుడితో కలిసి తల్లిగారు ఊరైన కౌకుంట్లలో ఉండి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈ క్రమంలోనే రోజులాగే మంగళవారం కూలి పనికి వెళ్తుండగా గ్రామ సమీపంలో గోపన్‌పల్లికి చెందిన కారు ఢీకొంది. ఈ ఘటనలో మంగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి.. అటు నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పోషణ భారం వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యలపై పడింది.

అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు..



వీరస్వామి (ఫైల్)

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బండారు వీరస్వామి 17 రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. అతడు బుధవారం సంపత్‌రావుపల్లి గ్రామ శివారులో శవమై కనిపించినట్లు ఎస్ఐ కె.రాణి తెలిపారు. శివస్వాముల వెంట పాదయాత్రగా శ్రీశైలం వెళ్తానని చెప్పిన అతడు.. సంపత్‌రావుపల్లి గ్రామ శివారులోని 160 సర్వే నంబర్‌లో మృతి చెందినట్లు తెలిపారు. అతడి ఆధార్ కార్డు ఆధారంగా వీరస్వామిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెకం దాడిలో ఆవుదూడ మృతి

నారాయణపేట రూరల్: మెకం దాడిలో ఆవు దూడ మృతిచెందిన ఘటన మండలంలోని పిల్లిగుండ్లతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. తండాకు చెందిన రైతు గంగ్యానాయక్ తనకున్న ఆవులు, ఎద్దులు తండా శివారులోని పొలంలో ఉన్న పాకలో కట్టేసేవారు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి కూడా పాకలో పశువులకు మేత వేసి ఇంటికి వచ్చారు. పరిసరాల్లోని గుట్టల నుంచి వచ్చిన మెకం ఆవు దూడపై దాడిచేసి చంపేసింది. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన గంగ్యానాయక్ దూడ చనిపోయి ఉండటాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. బీట్ అధికారి మల్లేశ్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

తప్పిన పెను ప్రమాదం




మరికల్: మండల కేంద్రంలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. మరికల్‌లోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం ఎదుట వరికోత మిషన్ సడెన్ బ్రేక్ వేయడంతో.. దేవరకద్ర నుంచి పశువుల లోడ్‌తో మక్తల్ వైపు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. దీంతో వరికోత మిషన్ రోడ్డు పక్కకు నిలిపి ఉంచిన ఆటోపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అంతే కాకుండా పశువుల డీసీఎంలో ఆరుగురు ఉండగా.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డీసీఎంలో ఓ ఎద్దుకు తీవ్రగాయాలు కావడంతో పశు వైద్యుడిచే చికిత్స చేయించారు.

బైక్ దొంగతనానికి యత్నించిన మైనర్

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి ఎదుట పార్క్ చేసి ఉంచిన బైక్‌ను దొంగతనం చేయడానికి ప్రయత్నం చేసిన దొంగను స్థానికులు పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బండ్లగేరికి చెందిన శేఖర్ అనే వ్యక్తి తనకు సంబంధించిన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున అదే ఏరియాకు చెందిన మైనర్ బాలుడు బైక్‌ను అపహరించి తీసుకువెళ్తుంటే వాహన యాజమానితో పాటు స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కిడ్నీ.. బీకేర్ ఫుల్

- మారుతున్న జీవన విధానం
- ఒత్తిడికి లోనవుతున్న యువత
- మారిన ఆహారపు అలవాట్లు
- ప్రభావం చూపుతున్న షుగర్, బీపీ రోగాలు
- మోతాదులో నీళ్లు తాగక అనర్థాలు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ సమస్యల బాధితులు
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం



పాలమూరు: మానవ శరీరంలో కిడ్నీలు ఎంతో ప్రధానమైనవి. వీటిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కిడ్నీ సమస్యతో బాధపడే వారు పెరిగిపోతున్నారు. మారుతున్న జీవన విధానంతో యువత ఒత్తిడికి లోనవుతోంది. దీనికితోడు ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ఉప్పు, మసాలాలతో కూడిన ఆహారానికి అలవాటు పడటం, మానసిక ఒత్తిడి, ఎక్కువగా నొప్పులకు ఉపయోగించే ట్యాబ్‌లెట్స్ వాడటం, షుగర్, బీపీ, ఊబకాయం, మద్యం, పొగాకు బానిసవ్వడం తదితర అలవాట్లు కిడ్నీ రోగాలకు దారితీస్తోంది. రోజులో కనీసం అరగంట కూడా వ్యాయామం చేయకపోవడంతో ఈ సమస్య మరింత పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు మూత్రపిండాలపై అధిక ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఆహారం తినేటప్పుడు మాత్రమే యువత నీళ్లను తాగకపోవడంతో శరీరానికి అవసరమైన నీరు లభించడం లేదు. మరోవైపు ప్రాథమిక స్థాయిలో కిడ్నీ సమస్యలు గుర్తించకపోవడం, నిర్లక్ష్యం వల్ల రాళ్ల సమస్య ఏర్పడుతోంది. జిల్లాలో 28–30ఏళ్ల వయస్సులో అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేయడంతో కిడ్నీలు దెబ్బతింటున్న సందర్భాలు కన్పిస్తున్నాయి.

సమస్య తీవ్రతరం అయితే తప్ప..

ప్రతి ఏడాది మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా నిర్వహిస్తారు. కిడ్నీలు శరీరంలో వెన్నుముకకు ఇరువైపుల 9–10సెంటిమీటర్ల వెడల్పుతో పాటు 150గ్రాముల బరువు కల్గి ఉంటాయి. కిడ్నీ ప్రధాన శరీరంలోని నీటి లవణాల సమతుల్యత, రక్త తయారీలో కీలక పాత్ర, మూత్రం తయారీ చేస్తుంటాయి. ప్రధానంగా కిడ్నీల్లో సమస్య తీవ్రతరం అయితే తప్పా లక్షణాలు బయటపడవు. కిడ్నీ సమస్య ఉన్న వారిలో ప్రధానంగా ఆకలి మందగించడం, నీరసం, వాంతులు, చిరాకు, బరువు తగ్గడం, కాళ్ల వాపులు, మూత్రం తగ్గడం, ముఖం వాపు రావడం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

కిడ్నీల సంరక్షణకు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కిడ్నీ వ్యాధిని కట్టడి చేయాలంటే ప్రధానంగా రోజు తగినంత వ్యాయామం చేయడం, కావాల్సినంత నిద్ర,ఒత్తిడి లేకుండా జీవనం, సరైన మోతాదులో నీరు తాగడం, బీపీ, షుగర్ నియంత్రణలో పెట్టుకోవడం చేయాలి.

- దీర్ఘకాలికంగా కిడ్నీలు చెడిపోయిన రోగుల్లో క్రియాటిన్, పొటాషియం శాతాల పెరుగుదల శరీరంలో అదనంగా నీరు చేరిన ఆధారంగా ఎన్నిసార్లు డయాలసిస్ చేయాలన్నది ఆధారపడి ఉంటుంది.
- రోగులకు శ్వాస తీసుకోవడంలో ఆకస్మాత్తుగా ఇబ్బంది ఎదురవుతోంది. ఆ నేపథ్యంలో వెంటనే డయాలసిస్ చేపట్టాలి. అందుబాటులో కేంద్రం ఉంటే రోగికి మేలు జరుగుతుంది. సుదూరంలో ఉండటంతో ఒక్కోసారి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.
- రక్తం తక్కువగా ఉంటే ఎరిత్రోఫాయింట్ ఇంజక్షన్ ఇస్తారు. మరీ తక్కువగా ఉంటే నేరుగా రక్తం ఎక్కించాల్సి వస్తుంది. సమీపంలోనే కేంద్రం ఉంటే ఇలాంటి సందర్భాల్లో రోగి కుటుంబ సభ్యులకు ఆందోళన ఉండదు.
- కిడ్నీ రోగులకు ఒక్కసారిగా బీపీ పడిపోయే ప్రమాదం ఉంది. కేంద్రాలు దగ్గరలోనే ఉంటే వెంటనే రోగిని కాపాడేందుకు అవకాశాలు ఎక్కువ.

జిల్లాల వారీగా డయాలసిస్ రోగుల వివరాలు

యూనిట్‌పేరు	మిషన్లు	రోగుల సంఖ్య
మహబూబ్‌నగర్	10	60
కల్వకుర్తి	5	38
నాగర్‌కర్నూల్	10	50
అచ్చంపేట	5	37
వనపర్తి	10	88
గద్వాల	12	90
నారాయణపేట	10	61
కొల్లాపూర్	5	25
బాలానగర్	5	10
అలంపూర్	5	20

మారుతున్న జీవనశైలితో..



కిడ్నీ సంబంధిత సమస్య ఉన్నవారిలో మొదట లక్షణాలు నీరసం, ఆకలి మందగించడం, మూత్రం తక్కువగా రావడం కన్పిస్తుంది. ఇలాంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేసుకోవాలి. ప్రస్తుతం చాలా మందిలో మారుతున్న జీవనశైలితో కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. నాణ్యతతో కూడిన డయాలసిస్ చేసుకోకపోవడం వల్ల కూడా సమస్య పరిష్కారం కావడం లేదు. హెచ్‌డీఎఫ్ కానీ హెచ్‌వోఎంఎల్, హెచ్‌డీ, నాచ్యురల్ హెచ్‌టీ చేస్తే ఫలితం మెరుగైన స్థితిలో ఉంటుంది.

– డాక్టర్ ఎ.జీ. శంకర్, ఎండీ, నెఫ్రాలజిస్ట్, మహబూబ్‌నగర్

గద్వాల, వనపర్తి జిల్లాలోనే..



డయాలసిస్ చేస్తున్న దృశ్యం

ఉమ్మడి పాలమూరులో గద్వాల, వనపర్తి జిల్లాలో కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు జిల్లాలో డయాలసిస్ రోగులు అధికంగా ఉన్నారు. స్థానికంగా ఉండే వాతావరణ పరిస్థితితో పాటు ఆహార అలవాట్లు వల్ల కూడా కిడ్నీ బాధితులు అధికమవుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 77 మిషన్స్ ద్వారా 479మంది డయాలసిస్ రోగులకు నిత్యం డయాలసిస్ చేస్తున్నారు. కొత్తగా ఆత్మకూర్‌లో ఐదు, మక్తల్‌లో ఐదు పరికరాలతో కూడిన డయాలసిస్ సెంటర్స్ ఏర్పాటు కానున్నాయి.

రోబోలతో రెస్క్యూ ఆపరేషన్

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న అన్వేషణ
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో, రెస్క్యూ బృందాలతో సహాయక చర్యలు
- 19 రోజులైనా లభ్యం కాని ఏడుగురి కార్మికుల ఆచూకీ



సొరంగంలోకి వెళ్తున్న రెస్క్యూ బృందాలు

అచ్చంపేట/మన్ననూర్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. సొరంగంలో జరిగిన ప్రమాదంలో గల్లంతైన కార్మికుల ఆచూకీ తెలుసుకునేందుకు అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో సేవలు వినియోగించుకుంటున్నారు. బుధవారం అన్వీ రోబోటిక్ సంస్థ ప్రతినిధులు విజయ్, అక్షయ్ తమ బృందంతో కలిసి లోకో ట్రెన్ ద్వారా మొదటి షిఫ్ట్‌లో ఒక రోబో, ఏ1 అత్యాధునిక టెక్నాలజీ కలిగిన కెమెరాలతో టన్నెల్ లోపల ప్రమాద ప్రదేశానికి వెళ్లారు. రోబో ద్వారా పేరుకుపోయిన శిథిలాలు, మట్టిని తొలగింపు పనులు చేపట్టారు. 40 హెచ్‌పీ పంపు సహాయంతో బురదను బయటికి పంపింగ్ చేస్తున్నారు. అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో గంటకు 5వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించే సామర్థ్యం కలిగి ఉంది. వీటితో పాటు రిస్క్యూ బృందాలతో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. మొత్తం 12 బృందాలకు చెందిన సభ్యులు నిరంతరం పనిచేస్తున్నారు.

లభించని ఆచూకీ..

టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికుల్లో ఈ నెల 9న పంజాబ్‌కు చెందిన టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని వెలికితీశారు. మిగిలిన ఏడుగురి కోసం 19వ రోజు రెస్క్యూ బృందాల అన్వేషణ కొనసాగింది. ఓవైపు రోబోలు, మరోవైపు రెస్క్యూ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. కాడవర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో ఇదివరకే ఏర్పాటు చేసుకున్న మాస్టర్ రోబో సహాయంతో రోబోలు తవ్వకాలు చేపట్టాయి. అయినప్పటికీ కార్మికుల ఆచూకీ లభించలేదు. అయితే 13.5 కి.మీ. వద్ద దిగువ భాగం నుంచి నీటి ఊట ఎక్కువగా వస్తుండటంతో సహాయక చర్యలకు కొంత విఘాతం కలుగుతుంది. అతి ప్రమాదకరంగా ఉన్న డీ1 వద్దకు వెళ్లేందుకు రిస్క్యూ బృందాలు సాహసం చేయడం లేదని తెలుస్తోంది. అక్కడ సుమారుగా 15 అడుగులకు పైగా మట్టి పేరుకుపోయింది. దీంతో రోబోల సాయంతో మట్టి తొలగింపు పనులను ముమ్మరం చేస్తున్నారు. కాగా, దోమలపెంటకు 8 కి.మీ. దూరంలోని సొరంగం పైభాగంలో భూగర్భ పరిస్థితులను తెలుసుకునేందుకు జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) ప్రతినిధులు వారం రోజులుగా సర్వే కొనసాగిస్తున్నారు.



సొరంగంలోకి వెళ్తున్న అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో

ఉన్నతాధికారుల సమీక్ష..

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ రెస్క్యూ బృందాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. టన్నెల్‌లో సహాయక చర్యలను వేగంగా పూర్తి చేయడానికి ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సొరంగంలో ఉన్న శిథిలాలు, మట్టి, తేమ, ఆక్సిజన్ వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని రోబోలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. సహాయక బృందాలకు అవసరమైన సామగ్రి, తాగునీరు, మెడికల్ సపోర్ట్, ఆక్సిజన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



అందని నీరు.. అన్నదాత కన్నీరు...



మేకలు మేస్తున్న వేరుశనగ పంట

పాన్‌గల్ మండలం అన్నారంతండాకు చెందిన కంద్యా నాయక్‌కు మూడెకరాల పొలం ఉంది. కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు అందుతుందన్న ఆశతో రూ.లక్ష అప్పు చేసి యాసంగిలో రెండెకరాల్లో వేరుశనగ, ఎకరం వరి సాగు చేశారు. కాల్వలో నీరు నిలిచి.. ఉన్న బోరుబావుల్లో భూగర్భ జలం అడుగంటి నీరందక పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో చేసేది లేక మేకలు, ఎద్దులను మేపుతున్నారు. – పాన్‌గల్



ఎండిన వరి పైరు

ఘాటు తగ్గిన ఉల్లి



ఉల్లి కుప్పలతో నిండిపోయిన మార్కెట్ యార్డు

- ఒక్కసారిగా పడిపోయిన ధరలు
- మార్కెట్లో ఎటుచూసినా ఉల్లి కుప్పలే
- గరిష్టంగా రూ. 1,600
- కనిష్టంగా రూ. 1,100

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు ధమాల్ అన్నాయి. వేలల్లో ఉన్న ధరలు ఇప్పుడు వందల్లోకి మారిపోయాయి. కనిష్ఠ గరిష్ఠ ధరల నమోదు పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం సీజన్ కావడంతో రైతులు పండించిన ఉల్లిని పెద్దఎత్తున మార్కెట్ తెచ్చారు. మార్కెట్‌కు దాదాపు పది వేల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో మార్కెట్ యార్డు అంతా ఉల్లి కుప్పలతో నిండిపోయింది. యార్డు అవరణ అంతా ఉల్లి కుప్పలతో నిండిపోగా స్థలం సరిపోక గోదాంల పక్కన సీసీ రోడ్డుపై ఉల్లిని కుప్పలుగా పోశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఉల్లి సీజన్ ప్రారంభమైనా ధరలు నిలకడగా కొనసాగాయి.

మధ్యాహ్నం వరకు కొనసాగిన వేలం

దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ఉల్లి ఎక్కువగా ఉండడంతో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వేలం పాటలు మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగాయి. మార్కెట్‌కు వచ్చిన ఉల్లి బాగా ఆరబెట్టడంతో పాటు నాణ్యతగా ఉండడంతో వ్యాపారులు పోటీపడి వేలం పాటలు పాడారు. ధరలు మాత్రం పూర్తిగా పడి పోయావి. క్వింటాల్ ఉల్లికి గరిష్టంగా రూ. 1,600లు పలికింది. గత వారం కన్నా రూ. 1000 వరకు తగ్గింది. కనిష్ఠంగా రూ. 1,100 లు నమోదు కాగ గత వారం కన్నా రూ. 700 వరకు తగ్గింది. స్థానిక వ్యాపారులతో పాటు బయట నుంచి వచ్చిన వ్యాపారులు, చిరు వ్యాపారులు కూడా చిన్న చిన్న కుప్పలను కొనుగోలు చేశారు.

ఎగబడ్డ వినియోగదారులు

ఉల్లి ధరలు తగ్గడంతో వినియోగ దారులు ఎగబడి కొనుగోలు చేశారు. ఎక్కడ నాణ్యతగా ఉల్లి కుప్పలు ఉంటే అక్కడికి వెళ్లి బస్తాలకు నింపుకొని తూకాలు వేయించుకొని మరీ కొనుగోలు చేశారు. వేలాది మంది వినియోగదారులు నిల్వ చేసుకోవడానికి బస్తాలుగా కొనుగోలు చేయగా చిరు వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున ఉల్లిని కొన్నారు. ఇక బయట నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో కొన్న ఉల్లిని వాహనాలకు నింపుకొని తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్ యార్డు అంతా ఉల్లి లావాదేవీలతో సందడిగా కనిపించింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తాను గరిష్ఠంగా రూ. 800, కనిష్ఠంగా రూ. 550గా ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించారు.

నైపుణ్యాభివృద్ధితోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా. దండా రాజిరెడ్డి

- తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా. దండా రాజిరెడ్డి

కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అవసరమైన కూరగాయలు, పండ్లు సొంతంగా పండించుకోవడానికి 'ఉద్యాన మోడల్' అభివృద్ధి చేస్తున్నామని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డా. దండా రాజిరెడ్డి తెలిపారు. బుధవారం పెద్దమందడి మండలం మోజర్లలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలో నిర్వహించిన కెరీర్ శిక్షణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలతో పాటు వ్యక్తిత్వ వికాసం ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని.. ప్రతి కళాశాలలో పోటీ పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేసి నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం ఉద్యాన విద్యార్థుల అవగాహన క్షేత్రాలను పరిశీలించి మొక్కల సాంద్రత పెంచితే వేసవిలో తోటలను రక్షించుకోవచ్చని సూచించారు. జిల్లాలో సమస్యాత్మక భూములు ఎక్కువగా ఉన్నందున భూసార పరీక్షలు చేపట్టిన తర్వాతే ఉద్యాన తోటలు పెంచుకోవాలన్నారు. ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో మామిడి, నేరేడు, దానిమ్మ, ఫిగ్, సీతాఫలం వంటి పండ్ల అంటు మొక్కలు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తామని తెలిపారు. ఉద్యాన ఆధారిత పరిశ్రమలు, వ్యాపారాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థి ఉద్యాన అంకుర పరిశ్రమల ఏర్పాటుకు యూనివర్సిటీ నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థినులకు అదనపు గదుల నిర్మాణం త్వరలోనే చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డా. భగవాన్, అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య, ఎస్టేట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి, అడ్వయిజర్ వీరాంజనేయులు, డా. షహనాజ్, డా. పూర్ణిమ మిశ్రా, శ్రీనివాస్, శంకర్‌స్వామి, గౌతమి, విద్యా, నవ్య, శ్వేత, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

'అలివేలు మంగ' ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ కాంతుల్లో రాజగోపురం

- 14న అమ్మవారి తిరు కల్యాణం

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ తిరుపతిగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం దిగువ కొండ వద్ద వెలసిన అలివేలు మంగతాయారు దేవస్థానానికి విశిష్ట చరిత్ర ఉంది. పురాతన కాలం నుంచి ఓవెలుగు వెలిగిన ఈ దేవస్థానం కొత్త పుంతలు తొక్కుతోంది. ఇక్కడ వివాహాలు చేసుకుంటే ఆ జంటలపై అమ్మవారి చల్లని కటాక్షం ఉంటుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొన్నేళ్లుగా దేవస్థానం వద్ద ప్రతి సంవత్సరం జరిగే వివాహాల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి. అమ్మవారికి ప్రత్యేక అర్చనలతో పాటు కుంకుమార్చన చేస్తే కోర్కెలు తీరడంతో పాటు అమ్మవారి చల్లని దీవెనలతో నిండు ముత్తైదువులుగా ఉంటారని నమ్మకం. ప్రతియేడు అమ్మవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఘనమైన ఏర్పాట్లు చేశారు. మన్యంకొండ గుట్టపై వెలసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరిగిన నెల రోజులకు శ్రీఅలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. బుధవారం నుంచి నుంచి 16వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా అంకురార్పణంతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం గజవాహన సేవ నిర్వహించారు. గురువారం 13న ధ్వజారోహణం, దేవతాహ్వానం, 14న మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి తిరు కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు విమాన రథోత్సవం, గరుడవాహన సేవ, 15న అశ్వవాహన సేవ, 16న పూర్ణాహుతి, వసంతోత్సవం, అమృతస్నానం, నాకబలి (నాగవెల్లి) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. కాగా.. ఉత్సవాల్లోని ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణోత్సవం 14న జరుగనుంది. దేవస్థాన ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే కల్యాణ మండపంలో జరిగే ఈ పవిత్ర కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతారు. అదే రోజు రాత్రి అమ్మవారి విమాన రథోత్సవం నిర్వహిస్తారు.





అలంకరణలో అలివేలు మంగ అమ్మవారు.. ఉత్సవాలకు అంకురార్పణం చేస్తున్న వేదపండితులు

అమ్మ చెంతన శుభకార్యానికి శ్రీకారం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి 17 కిలో మీటర్ల దూరంలో రాయచూర్ వెళ్లే మార్గంలోని మన్యంకొండ స్టేజీ సమీపంలో శ్రీఅలువేలు మంగతాయరు దేవస్థానం ఉంది. అమ్మవారి సన్నిధిలో ప్రతి ఏడాది కొన్నివందల వివాహాలు జరుగుతాయి. పెళ్లిళ్ల సీజన్‌లో ఒకేరోజు 25కు పైగా వివాహాలు జరిగిన సందర్భాలున్నాయి. వివిధ సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మచెంతన భక్తులు శుభకార్యానికి శ్రీకారం చుడుతారు. అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి మంటపంలో పెళ్లిళ్లు చేసుకుంటారు. అమ్మవారి చల్లని సన్నిధిలో వివాహాలే కాకుండా మహిళలు కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను చేసి పునీతులవుతారు. తన చల్లని ఆశీస్సులతో ప్రతి ఏడాది కొన్ని వందలాది జంటల వైవాహిక జీవితానికి అమ్మవారు వారధి అవుతున్నారు.